క్లుప్తంగా

గ్రామకంఠం భూముల కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మరికల్: మండల కేంద్రంలోని హరిజన్‌వాడలో గ్రామకంఠం భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు సోమవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామకంఠంగా భూమిని ప్లాట్లుగా చేసి అమ్ముకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదన్నారు. అక్కడ ఏళ్ల తరబడి ఇళ్లు నిర్మించుకున్న వారి స్థలాలను కూడా కబ్జా చేసుకుంటున్నారన్నారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని బాధితులు గుంప నర్సింహులు పేర్కొన్నారు.

పాఠశాల ప్రహరీకి భూమిపూజ



మరికల్: మండలంలోని పస్పుల ప్రాథమిక పాఠశాల చుట్టు ప్రహరీ నిర్మాణానికి సోమవారం మాజీ ఎంపీటీసీ జయమ్మ భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే పర్ణికారెడ్డి సహకారంతో అమ్మ ఆదర్శ పాఠశాల కింద ప్రహరీ నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరైనట్లు వారు తెలిపారు. కాంట్రాక్టర్ నాణ్యతతో త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాఘవేంద్రగౌడ్, నర్సింహులు, రవి కుమార్‌గౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కొత్తపల్లి: అనారోగ్యంతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొంది సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సోమవారం చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. మండలంలోని నిడ్జింత గ్రామానికి చెందిన రెనివట్ల కన్యప్పకు రూ.1లక్ష, జాజాపురం తిమ్మమ్మకు రూ.60వేల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, విజయ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణారెడ్డి, కల్యాణ్ పాల్గొన్నారు.

కోడేరు: మండలంలోని మాచుపల్లికి చెందిన అలివేలమ్మకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.33500లు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం కాంగ్రెస్ నాయకులు కురుమూర్తి బాధిత కుటుంబానికి అందజేశారు. పరశురాముడు, రామచంద్రయ్య, రాజు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల క్షేత్రస్థాయి పరిశీలన



ధన్వాడ: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై సోమవారం మండలంలోని కొండ్రోనిపల్లి గ్రామంలో అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గ్రామంలో 17 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా, వారు అర్హులా లేదా? అనే విషయాలు పరిశీలించారు. గ్రామ ప్రత్యేక అధికారి ఏఈ శివానంద్ ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి ప్రతి లబ్ధిదారుడి వద్దకు వెళ్లి ఇంటి స్థలం పరిశీలించి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సౌందర్య, సుధాకర్, మధవీలత, నర్సింహులు, రాజు, తదితరులు ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

నారాయణపేట రూరల్: మండలంలోని బోయిన్ పల్లి గ్రామ శివారులో డబ్బు పెట్టి పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం సాయంత్రం దాడి నిర్వహించారు. పందెం కాస్తూ ఆటాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి ఆరు సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు, రూ.3,450, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. గేమింగ్ యాక్ట్ ప్రకారం వారిపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాయుడు తెలిపారు.

బసవ జయంతి వేడుకలకు సిద్ధం

నారాయణపేట రూరల్: పట్టణంలోని సరాఫ్ బజార్‌లో వెలసిన దేవాదాయ ఆలయం వీరభద్రేశ్వర సమేత బసవేశ్వర మందిరంలో బుధవారం బసవ జయంతి వేడుకలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బుస్సయ్య స్వామి తెలిపారు. ఆలయానికి రంగులు వేయించి, విద్యుదీపలంకరణ చేయించాలన్నారు. బుధవారం ఆలయంలో స్వామి వారికి రుద్రాభిషేకం జరుగుతుందన్నారు. 10 గంటలకు ఆలయంపై పతాకావిష్కరణ, 11.30 లకు స్వామివారి డోలారోహణం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 6 గంటలకు స్వామివారి చిత్రపటం బండిపై భారీ ఊరేగింపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పట్టణ వీరశైవ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

లక్ష్యం..68వేల మొక్కలు



అమ్మపల్లి నర్సరీలో మొక్కలకు గ్రీన్‌మ్యాట్ వేసిన అధికారులు

- నర్సరీలకు చలువ పందిళ్లు
- వేసవిలో మొక్కల రక్షణకు చర్యలు
- ప్రతిరోజు అధికారుల పర్యవేక్షణ

మాగనూర్: మండలంలో మొక్కల పెంపకం 68వేలు లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కల పెంపకం చేస్తున్నారు. రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగుతుండడంతో పాటు వడగాలులు సైతం వీస్తుండడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై నర్సరీలోని మొక్కలపై ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టింది. గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీలలో ప్రత్యేకంగా వేసవి ప్రణాళికలను సిద్ధం చేసింది. ఎండవేడిమికి నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా అధికారులు నర్సరీలకు చలువ పందిళ్ల ఏర్పాటు చేశారు. ఈ పర్యవేక్షణ బాధ్యతలు పంచాయతీలకే అప్పగించారు. నర్సరీలో పెంచే మొక్కలు ఇళ్ల, రహదారుల పక్కన, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో నాటేందుకు అధికారులు ప్రణాళికలను సైతం రూపొందించారు. మండలంలో 16 గ్రామ పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేశారు.

వన సేవకులు..

నర్సరీల్లో పెంచే మొక్కలను సంరక్షించేందుకు వన సేవకులను నియమించారు. వారు ప్రతిరోజు నీటిని అందిస్తున్నారు. నాటిన విత్తనాలు మొలకెత్తడానికి, పెరుగుతున్న మొక్కలను రక్షించడానికి వన సేవకులు నర్సరీలో నిరంతరం సంరక్షణ పనులు చేపడుతున్నారు.

16 గ్రామ పంచాయతీల్లో..68వేల మొక్కలు

మాగనూర్ మండల వ్యాప్తంగా 16 గ్రామపంచాయతీలలో ప్రతి గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున నర్సరీ ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో ఉన్న నర్సరీల్లో మొక్కల సంరక్షణకు వన సేవకుడిని నియమించారు. వీరు నర్సరీల్లో విత్తనాలు వేసిన మొదలు మొక్కలుగా ఎదిగే వరకు తగు చర్యలు తీసుకుంటున్నారు. ఏపుగా పెరిగిన మొక్కలను ఒక చోటికి మారుస్తున్నారు. పూలు, పండ్లు, ఇతర మొక్కలను పంచాయతీలో విరివిగా పెంచుతున్నారు. ఒక్కో నర్సరీలో 5నుంచి 8 వేల మొక్కలను పెంచుతున్నారు. మొత్తం 68 వేల మొక్కలను పెంపడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు.

> **గ్రీన్‌మ్యాట్స్ ఏర్పాటు చేశాం..**
>
> 
>
> వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశాం. ప్రతి గ్రామంలో అవసరమైన వివిధ రకాల మొక్కలను ఆయా గ్రామాల్లోని నర్సరీలో పెంచుతున్నాం. మండల వ్యాప్తంగా 16 నర్సరీలో 68 వేల మొక్కల సంరక్షణకు, ఎండకు దెబ్బతినకుండా నర్సరీలో గ్రీన్ మ్యాట్‌తో చలువ పందిళ్లు ఏర్పాటు చేశాం.
>
> – మన్యం ఏపీఓ మాగనూర్

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

- రూ.1.27 కోట్లతో బీటీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న తిరుపతిరెడ్డి, కడా చైర్మన్ వెంకట్‌రెడ్డి

కోస్గి రూరల్: గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యమని కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని పలు గ్రామాలలో బీటీ రోడ్ల నిర్మాణానికి, అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు రూ.127 కోట్లతో మండలంలోని పలు గ్రామాల బీటీ రోడ్లకు భూమి పూజ నిర్వహించారు. యువతకు స్వయం ఉపాధి కోసం రాజీవ్ యువశక్తి పథకం ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో రూ.13.16 కోట్లతో చంద్రవంచ నుంచి ఇమ్మాపూర్, కొత్తపల్లి వరకు రోడ్డు విస్తరణ పనులు, రూ.4.55 కోట్లతో చంద్రవంచ నుంచి ముక్తిపాడ్, ముశ్రీఫా గ్రామం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. రూ.7.80కోట్లతో పోతిరెడ్డిపల్లి నుంచి తోగాపూర్ మీదుగా పందిరిహన్మండ్ల వరకు రోడ్డు నిర్మాణం, రూ.30.37 కోట్లతో కోస్గి నుంచి నాగసాన్‌పల్లి, సారంగరావుపల్లి, ముదిరెడ్డిపల్లి మీదుగా గుండుమాల్ వరకు రోడ్డు ఏర్పాటు చేస్తామన్నారు. రూ.3.90 కోట్లతో కోస్గి నుంచి ముక్తిపాడ్ వరకు, రూ.63.04 కోట్లతో కోస్గి నుంచి పల్లేర్ల మీదుగా మద్దూర్ వరకు రోడ్డు పనుల నిర్మాణం, రూ.5.72 కోట్లతో కోస్గి నుంచి రాంపూర్ మీదుగా తోగాపూర్ వరకు రోడ్డు నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, కోస్గి, గుండుమాల్ మండల అధ్యక్షులు రఘువర్ధన్‌రెడ్డి, విక్రంరెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు బెజ్జు రాములు, పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షులు భీంరెడ్డి, అన్న కిష్టప్ప, నాగులపల్లి నరేందర్, కోడిగంటి హరి, టెంటు నర్సింహ, మాస్టర్ శ్రీనివాస్, బాలేష్, భానునాయక్, రాస్నం బాల్‌రాజ్, మధుకర్‌రావు, ఓంప్రకాశ్, మోహన్‌రెడ్డి ఉన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తులతో ర్యాలీ



ఉగ్రదాడిలో అమరులైన వారికి సంఘీభావంగా భూనీడులో కొవ్వొత్తులతో నివాళి

కొత్తపల్లి: జమ్ము కశ్మీర్, పహల్గాం పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిలో అమరులైన వారికి సంఘీభావంగా శనివారం రాత్రి కొత్తపల్లి మండలంలోని భూనీడు గ్రామంలో హిందూ, ముస్లింలు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అంతకు ముందు గ్రామంలోని ప్రధాన వీధుల్లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. గ్రామ యువకులు, గ్రామస్తులు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ జాగిలాలతో తనిఖీ



మక్తల్: నారాయణపేట ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం మక్తల్ పట్టణంలో పలు ప్రదేశాల్లో పోలీసుల జాగిలాలతో తనిఖీ నిర్వహించారు. ఆయా ప్రదేశాలలో గంజాయి, మత్తు పదార్థాలు, అక్రమ రవాణా జరుగకుండా పకడ్బందీగా కిరాణ, పాన్‌షాపుల్లో తనిఖీ నిర్వహించారు. ఎవరైనా మత్తు పదార్థాలు వినియోగిస్తే 100 కాల్ చేయాలని కోరారు. పోలీసులు విష్ణువర్ధన్, నార్కోటిక్స్ డాగ్ విక్కి హ్యాండ్లర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు



చెన్నారెడ్డిపల్లి రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు

మద్దూరు: రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతి రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ మహేశ్ గౌడ్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని చెన్నారెడ్డి పల్లి, మోమినాపూర్‌లో వాసుదేవాచారి గ్రామాల్లో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. చెన్నారెడ్డి పల్లిలో 50 దరఖాస్తులు, మోమినాపూర్‌లో 143 దరఖాస్తులు తీసుకున్నట్లు తహసీల్దార్ మహేశ్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాస్‌గౌడ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

మాగనూర్: సైబర్ నేరాలు, రోడ్డు భద్రత నియమాలపైన అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ అశోక్ బాబు తెలిపారు. సోమవారం మాగనూర్ నల్లగట్టు మారెమ్మవ్వ దగ్గర హెచ్‌ఎచ్–167 రహదారిపై రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని, ట్రిబుల్ రైడింగ్ చేయరాదని, హెల్మెట్ సీట్ బెల్ట్ విధిగా ధరించాలని సూచించారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మాగనూర్ పోలీసులు పాల్గొన్నారు.

కందెన్‌పల్లిలో తాగునీటి ఎద్దడి

భగీరథ నీటి సరఫరా అంతరాయం



నీటి కోసం పబ్లిక్ బోర్ దగ్గర పడిగాపులు కాస్తున్న ప్రజలు

దామరగిద్ద: మండలంలోని కందెన్‌పల్లిలో గత కొన్ని రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. మూడు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచి పోవడంతో తాగునీటి కోసం వ్యవసాయ బోర్లను, తాగునీటి పబ్లిక్ బోర్‌ను ఆశ్రయించి నీరు పట్టు కుంటున్నారు. నీటి కోసం విద్యుత్ సరఫరా ఎప్పుడొస్తుందా అని పడిగాపులు కాస్తూ తాగునీటికి తంటాలు పడుతున్నారు. పంచాయతీ కార్యదర్శిని సంప్రదించిన నిధులు లేవని బదులిస్తున్నారని మాజీ ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ విషయమై మిషన్‌భగీరథ ఏఈ నరేందర్‌ను వివరణ కోరగా ఇటీవల కొల్లంపల్లి దగ్గర పైప్‌లైన్‌పై రైతుబోరు వేయడంతో లీకేజీ ఏర్పడిందని, దాన్ని సరిచేయించారన్నారు. మన్నెంకొండ శాసన్‌పల్లి మధ్యలో వాల్ సమస్య కారణంగా నీటి ప్రెషర్ దగ్గినట్లు తెలిపారు. డీబ్ల్యూటీపీ నుంచి వత్తుగుండ్ల తండా సమీపంలోని జీఎల్‌బీఆర్ ఓహెచ్‌బీఆర్ పంపులకు నీటి సరఫరా తక్కువగా ఉండి ప్రెషర్ తగ్గడంతో సంపుల నుంచి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. ఈ విషయమై ఈఈ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా, మంగళవారం సమస్యను పరిష్కరించి నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికపై ఫిర్యాదు



ఊట్కూరు: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అవకతవకలు జరిగాయని సోమవారం ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో కొంతమంది ఇష్టానుసారంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో జాబితాను పునపరిశీలించి అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఆర్ నర్సింహులు, శేఖర్, ఎం భాస్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి



నారాయణపేట రూరల్: గత ప్రభుత్వ హయాంలో మంజూరైన అప్పక్ పల్లి నుంచి కోయిలకొండ డబుల్ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అడిషనల్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం కోటకొండ నుంచి ఇటు నారాయణపేట, అటు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రాలకు ఎంతోమంది రాకపోకలు సాగిస్తుంటారని, రోడ్డు పనులు మధ్యలో నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బిల్లు రాలేదని కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా పనులు చేపట్టకపోవడంతో సంవత్సర కాలంగా ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వివరించారు. వెంటనే డబుల్ రోడ్డు పనులకు నిధులు కేటాయించి పూర్తి చేయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాశీనాథ్, యాదగిరి, సుధాకర్, వెంకటయ్య పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నారాయణపేట రూరల్: అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కె.సత్యయాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని బైరంకొండలో నీరు నిలిచిన వరి పంటలు, తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. సకాలంలో గన్నీ బ్యాగులు ఇవ్వక, ట్రాన్స్‌పోర్టు సౌకర్యం కల్పించకపోవడంతోనే కల్లాల వద్ద ధాన్యం తడిసిపోయిందన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొని రైతులకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సోమశేఖరగౌడ్, విద్యాసాగర్, కృష్ణ, బీజేపీ మండల అధ్యక్షులు జ్యోతి, నాయకులు సాయిబన్న, రామకృష్ణ, శివ పాల్గొన్నారు.



అనుమానిత వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు



మరికల్: మండల కేంద్రంలో బంగ్లాదేశ్, పాకిస్తాన్‌కు చెందిన కొందరు అనుమానిత వ్యక్తులున్నట్లు సమాచారం ఉందని, వారిపై పోలీసులు నిఘా పెట్టి వారి దేశాలకు పంపాలని సోమవారం అఖిలపక్ష నాయకులు ఎస్‌ఐ రాముకు వినతి పత్రం సమర్పించారు. ఫేక్ ఆధార్‌కార్డులతో బంగ్లాదేశ్, పాకిస్తాన్‌కు చెందిన కొందరు వ్యక్తులు కొన్ని రోజులుగా మరికల్‌లో నివాసం ఉంటున్నట్లు పోలీసులకు తెలిపారు. అలాంటి వారిని గుర్తించి పూర్తి విచారణ చేసి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

ప్రతి నీటిబొట్టును ఒడిసి పట్టుకోవాలి



కొత్తపల్లిలో ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న అధికారులు

మాగనూర్: మానవులు నీటి వృథాను అరికట్టి ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకోవాలని సీజీడబ్ల్యూబీ టీం యాదయ్య అన్నారు. సోమవారం ఆయన మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సెంట్రల్ టీం జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాన్ని ఎక్కడ పడితే అక్కడ పట్టుకోండి అనే ఇతివృత్తంతో వర్షపు నీటిని ఆదా చేయడంతో పాటు సంరక్షించడంపై దృష్టి సారించాలన్నారు. ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నీటి వృథాను అరికట్టడంతో పాటు భూగర్భ జలాలను పెంచుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరు భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రహ్మతుద్దీన్, ఏపీఓ మన్యం, పంచాయతీ కార్యదర్శి నర్సింహారెడ్డి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణరెడ్డికి ఘన నివాళి



కాట్రేవ్‌పల్లిలో సత్యనారాయణరెడ్డికి నివాళులర్పిస్తున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: మండలంలోని కాట్రెవ్‌పల్లి గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ సత్యనారాయణరెడ్డి అనారోగ్యం వల్ల ఆదివారం అరుణాచల్‌ప్రదేశ్‌లో మృతి చెందాడు. అక్కడి నుంచి నేరుగా మృతదేహాన్ని విమానంలో హైదరాబాద్‌కు తరలించి, అక్కడి నుంచి సొంతూరు కాట్రెవ్‌పల్లికి తీసుకొచ్చారు. దీంతో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, గద్వాల మాజీ ఎమ్మెల్యే భరతసింహరెడ్డి, బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలక్రిష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, కాంట్రాక్టర్ జలందర్‌రెడ్డి, రాజుల ఆశిరెడ్డి కొండయ్యలు పూలమాలలు, పుష్పగుచ్ఛాలు ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఆయనకు భార్య రూప ఉన్నారు. గ్రామ సమీపంలో సత్యనారాయణరెడ్డికి అంత్యక్రియలు నిర్వహించారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

ఊట్కూరు: మండల కేంద్రంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కుంటిమారి లక్ష్మన్న భార్య పద్మమ్మ ఆదివారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సోమవారం ఉదయం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మక్తల్ మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

స్వర్ణోత్సవ వేడుకలు ప్రారంభం



ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం..

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ నరసాచల శ్రీభూ శ్రీనివాస స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన చేసి 50ఏళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా ఆలయంలో నిర్వహిస్తున్న స్వర్ణోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో భాగంగా తొలిరోజు ప్రత్యేక పూజలతో పాటు భగవత సప్తాహం, సంగీత కచేరి, ఆధ్యాత్మిక ధార్మిక ప్రసంగాలు కొనసాగాయి. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రాలయం పుణ్యక్షేత్ర పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు హాజరై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వేంకటేశ్వర స్వామిని కొలిస్తే భక్తులకు కొంగుబంగారంగా నిలుస్తున్నారన్నారు. నాడు రఘు ప్రేమ తీర్థుల శిష్యులు అనంత ఆచార్యులు ఆలయాన్ని కట్టించారని, 50 ఏళ్లుగా దివ్య క్షేత్రంగా విరాజిల్లుతోందని, ధూప దీప నైవేద్యాలతో కొనసాగించడం భక్తికి నిదర్శనం అన్నారు. ఏడు రోజుల కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని సూచించారు. అంతకుముందు పీఠాధిపతులను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు సీతారామారావు, జనార్దన్ రావు, ప్రభంజన్ రావు, శాంతానంద్ పురోహిత్, భీమ్ సేన్ చారి, హన్మేష్, ప్రకాష్ శేషు పాల్గొన్నారు

బొడ్రాయి పండుగ ప్రారంభం



నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ గ్రామంలో బొడ్రాయి పండుగ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి వేడుకలో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో మొదటిరోజు పాఠశాల క్రీడా మైదానంలో వేద పండితులు జయతీర్థ ఆధ్వర్యంలో ప్రత్యేక జెండా ఆవిష్కరణ చేసి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తమార్కండేయ స్వామి దేవాలయం నుంచి ఏర్పాటు చేసే తొమ్మిది బొడ్రాయిలను ట్రాక్టర్‌పై గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. ఈ ఊరేగింపులో మహిళలు మంగళ హారతులు పట్టగా యువతులు, బాలికలు నృత్యాలు చేస్తూ ముందు నడిచారు. గ్రామంలో దాదాపు 150 ఏళ్ల తర్వాత ఈ వేడుక నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. మరో రెండు రోజుల పాటు వివిధ రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించి బొడ్రాయి ప్రతిష్ఠాపన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు రవికుమార్, కాశన్న, లచ్చప్ప, నవీన్, సత్యప్ప, మల్లేష్, సిద్దు, రాజు, సురేందర్, కృష్ణయ్య, మహేష్, రాజు, రవి పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



నారాయణపేట రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మ శక్తిని వెలికి తీసేందుకు చిన్నారులు చదువుతో పాటు బాలకేంద్రంలో సాంప్రదాయ కళలు నేర్చుకోవాలని సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక బాల కేంద్రంలో వినాయక, నటరాజ, సరస్వతీమాత చిత్రపటాలకు పూజలు చేసి వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారులు వేసవి సెలవులను వృథా చేయకుండా బాల కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతిరోజు సాయంత్రం 5గంటల నుంచి 7గంటల వరకు తబలా, గాత్రం, కీబోర్డ్, రిథంప్యాడ్, భరత నాట్యం, జానపద నృత్యం నేర్పనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సంవత్సరానికి రూ.20, ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.50 అడ్మిషన్ ఫీజు ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థులు పేర్లు నమోదు చేసువాలని కోరారు. బాలకేంద్ర సిబ్బంది వసంత్, జ్ఞానామృత, సంగ నర్సింహులు పాల్గొన్నారు.